క్లుప్తంగా

పన్ను బకాయిలపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటి పన్ను, తాగునీరు, డ్రెయినేజీ పన్నుల బకాయిలపై 43వ డివిజన్‌లోని 126వ వార్డ్ సచివాలయం సీ14 క్లస్టర్ పరిధిలోని హెచ్‌ఐజీ గృహాల యజమానులకు సచివాలయ అడ్మిన్స్ట్రేటివ్ సెక్రటరీ స్మైలీ, వలంటీర్ వెన్న భవాని అవగాహన కల్పించారు. శనివారం వారు ఇంటింటికీ వెళ్లి నెలాఖరు లోపు అన్ని రకాల పన్నులు చెల్లించాలని తెలిపారు. లేకపోతే పెనాల్టీతో కట్టాల్సి ఉంటుందని చెప్పారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందన



విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన షేక్ గౌస్ మొహిద్దీన్‌కు వైఎస్సార్ సీపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు నేతలు శనివారం ఆయన నివాసానికి వెళ్లి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నజీర్, రసూల్, ప్రభు, సురేష్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో శనివారం టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పోలీస్ టీం సభ్యులు పర్యటించారు. కొత్తపేట ఆంజనేయ వాగు, వాటర్ ట్యాంక్ రోడ్డు, ఈద్గామ హాల్ రోడ్డు, బ్రహ్మంగారి మఠం, కటికల మస్తాన్ వీధి, సారంగం రోడ్డు, చిట్టినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. వాగు సెంటర్‌లో ఇటీవల చోటు చేసుకున్న కొట్లాట నేపథ్యంలో స్థానిక యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలు, కొట్లాటలు, వివాదాలలో తలదూర్చవద్దని, దీంతో భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. ఎవరైనా యువకులు వివాదాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దివాకర్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం నగర కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బుద్దా దివాకర్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన ఆ సంఘ రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ నియామక పత్రాన్ని బుద్దా దివాకర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంఘ నగర అధ్యక్షులు కనిశెట్టి లక్ష్మణరావు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం నగర ఉపాధ్యక్షుడిగా చిట్టినగర్‌కు చెందిన తమ్మిన దుర్గారావు నియమితులయ్యారు.

స్వరూపానందేంద్ర సరస్వతితో దుర్గగుడి చైర్మన్ కర్నాటి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజి నుంచి ఆశీస్సులు అందుకున్నారు. తిరుమలలో స్వామీజిని, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజిలను శనివారం కలిసిన చైర్మన్ కర్నాటి రాంబాబు వారి దివ్యాశీస్సులు అందుకున్నారు. స్వామీజికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేయొద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటికాసులు(గ్లకోమా)ను నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా అంధత్వం కలుగుతుందని నేత్ర వైద్య నిపుణురాలు ఇండ్ల స్వప్న అన్నారు. దీన్ని తొలిదశలోనే గుర్తిస్తే అంధత్వ నివారణ సులువుగా ఉంటుందన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోంలో శనివారం నీటికాసులు అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ దేశంలో 50 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారని, ఇంకో 70 మిలియన్లు దృష్టి దోషంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అంధత్వం కలిగించే వాటిల్లో గ్లకోమా ప్రధాన వ్యాధిగా పేర్కొన్నారు. ఇది వంశపారంపర్యంగా సంక్రమించడం ఎక్కువ అన్నారు. కొందరు పిల్లల్లో పుట్టుకతోనే గ్లకోమా ఉంటుందని తెలిపారు. గ్లకోమాకు మందులు, లేజర్‌చికిత్స, శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సదస్సుకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పాల్గొన్నారు.

గోరుముద్ద, అంగన్‌వాడీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ లక్ష్మీరెడ్డి



అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లాలో జగనన్న గోరుముద్ద పథకం, రేషన్ బియ్యం పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ లక్ష్మీరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో రేషన్ షాపులు, ఏఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పాఠశాలల్లో గోరుముద్ద పథకం అమలు తీరును ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 5.63లక్షలు పైగా తెల్లకార్డులు, 23వేల మంది అంత్యోదయ కార్డుదారులకు బియ్యం పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని నిర్దేశించిన సమయంలో సరైన పద్ధతిలో అందించాలన్నారు. మార్పు ట్రస్ట్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న న్యూట్రిషన్ పాడిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాంబే కాలనీలోని డాక్టర్ దక్షిణామూర్తి పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యత, పరిశుభ్రతనుపాటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ ప్రశాంతి, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీకాంత్, సహాయ సరఫరా అధికారులు లక్ష్మి, సీహెచ్ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ఓటమి రేపటి విజయానికి పునాది



విద్యార్థినికి జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ శ్యామల, కల్యాణి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి ఓటమి రేపటి విజయానికి పునాది వంటిదని నిమ్రా కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. శ్యామలాదేవి అన్నారు. భవానీపురంలోని సెయింట్‌జాన్స్ పాఠశాల 38వ వార్షికోత్సవంలో శనివారం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. అకడమిక్, కో కరిక్యులర్ యాక్టివిటీస్, స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్స్‌లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని, గెలుపు ఓటములు సహజమన్నారు. విజేతలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ పోటీల్లో విజయం సాధించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లో రాణించాలన్నారు. ఈడుపుగల్లు జెడ్పీహెచ్‌ఎస్ విశ్రాంత హెచ్‌ఎం పీపీఏ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు కేరెక్టర్, కమిట్‌మెంట్, క్లారిటీ, సిన్సియారిటీ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ థింకింగ్ అలవర్చుకుంటే సమస్యలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ మోనిక సుమన్, అకడమిక్ డైరెక్టర్ రామాభారతి, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి పాల్గొన్నారు.

విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకోవాలి

డీఆర్వో మోహన్‌కుమార్



ట్యాబ్‌లు వినియోగిస్తున్న తీరును పరిశీలిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అన్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ స్కూల్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మోహన్‌కుమార్ శనివారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో బియ్యం, సరుకులను పరిశీలించారు. పాఠశాలలోని టాయిలెట్లు పరిశీలించారు. 8, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సోషల్ సబ్జెక్ట్స్ బోధించారు. ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా అందించిన ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. 10 వేల నిమిషాలకు పైగా ట్యాబ్‌లు వినియోగించిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుత పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సందర్శనలో ఆయన వెంట ఉప తనిఖీ అధికారి కొండా రవికుమార్, పధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం.. దిశ

దిశ ఏసీపీ వీవీ నాయుడు



వీవీ నాయుడిని సత్కరిస్తున్న కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలకు రక్షణ కవచం దిశ యాప్ అని 'దిశ' ఏసీపీ వీవీ నాయుడు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, సృహప్తి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్తంగా శనివారం సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో దిశ యాప్, దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నాయుడు మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా వెళ్లేటప్పుడు అనుకోని సంఘటన జరిగితే స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్‌ను ఉపయోగిస్తే ప్రమాదకర పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. దిశ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రేవతి మాట్లాడుతూ దిశ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో ఎలా ఇన్‌స్టాల్ చేయాలి, ఉపయోగించే విధానాలను తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.మనోరంజని, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సృహప్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు వి.భారతి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ వైస్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం వీవీ.నాయుడిని కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ అనుభవమంత వయసు లేని లోకేష్‌కు ఆయన్ని విమర్శించే అర్హత లేదని వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చదువుకునే రోజుల్లోనే ఆయన్ని ఎదుర్కోవడానికి ధైర్యం లేక చంద్రబాబు తోక ముడిచి పక్కకు వెళ్లిపోయేవాడని గుర్తు చేశారు. పెద్దిరెడ్డి వ్యాపారాల గురించి మాట్లాడే ముందు మీ హెరిటేజ్ కంపెనీలో పాలు, మంచినీళ్లు ఎంతకు అమ్ముతున్నారో బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. పచ్చ మీడియా ఉంది కదా అని నోటికి వచ్చినట్లు అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

వేసవిలో మెట్రో లగ్జరీ ఏసీ బస్సులో ప్రయాణించండి



ఆటోనగర్ డిపోకు చెందిన నాన్ స్టాప్ ఏసీ లగ్జరీ బస్సు ఇదే

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే ఆర్టీసీ నాన్‌స్టాప్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులను వేసవిలో ప్రత్యేకంగా నడుపుతారు. ఆటోనగర్ డిపోకు చెందిన ఈ బస్సును ఏటా మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నడుపుతారు. డిపో నుంచి 9 బస్సులను తిప్పుతున్నారు. గుంటూరు నుంచి విజయవాడకు కేవలం 45 నిమిషాల్లో వెళ్తారు. విజయవాడ నుంచి ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100 ఉంటుంది.

రెండేళ్లల్లో వచ్చిన ఆదాయం

2022- 23లో ఫిబ్రవరి నెలకు రూ. 4.61 కోట్లు ఆదాయం వచ్చిందని ఆటోనగర్ డీఎం ప్రవీణ్‌కుమార్ చెప్పారు. 2021-22కు 2.44 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడ అధికంగా ఆదాయం వస్తుందని డీఎం పేర్కొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జె.ఆంజనేయులు అన్నారు. కృష్ణలంకలోని వీఎం రంగా నగరపాలక సంస్థ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన శనివారం ఆయన మత్తు పదార్థాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ తాత్కాలిక సంతోషానికి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు గమ్యం కాదని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం నిప్పుతో చెలగాటంలాంటిదన్నారు. మత్తుకు బానిసలైన వారిని డీ-ఎడిక్షన్ చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. వ్యసనానికి బానిసలైన విద్యార్థులు, యువతకు విముక్తి కలిగించేందుకు డాన్ బాస్కో నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.గ్రేసమ్మ, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ జె.వాణి, పాఠశాల ఉపాధ్యాయులు అంజనేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో శనివారం డాలీ ఏంజిల్స్ స్కూల్ వార్షికోత్సవం జరిగాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలు ఏర్పరుచుకునేలా చూడాలన్నారు. వత్తిడి లేకుండా ఆట పాటలతో విద్యను అందిస్తున్న డాలీ ఏంజిల్స్ స్కూల్ నిర్వాహకులను అభినందించారు. డెంటిస్ట్ డాక్టర్ సిరిగిరి హారిక మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. కార్యక్రమాలను స్కూలు డైరెక్టర్ ఎస్.నాగమల్లిక పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని 4వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రాజారాం సూచించారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కారని, అందరూ ఐపీసీ, రాజ్యాంగానికి లోబడి ఉండాలని సూచించారు. మారిన ఆలోచనలు, పరిస్థితులకు అనుగుణంగా నిర్భయ, దిశలాంటి చట్టాలు వచ్చాయన్నారు. ప్యానల్ అడ్వకేట్ పగిడిపల్లి రాము మాట్లాడుతూ మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రమేష్, అధ్యాపకులు కామేశ్వరి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



విజయవాడ కల్చరల్: నవోదయ విద్యాసంస్థల మాచవరం బ్రాంచి వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో జరిగిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యంతోపాటు ఫోక్ డాన్స్, రాధా కృష్ణుల నృత్యం, వివిధ వాద్య పరికరాలపై పలు అంశాలను ప్రదర్శించారు. విజయవాడ లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు కోటిరెడ్డి మాట్లాడుతూ లలిత కళలు మనో వికాసం కలిగిస్తాయన్నారు.

మత్స్య పరిశ్రమలో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మత్స్య పరిశ్రమలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి పరసా అఖిల అన్నారు. జాతీయ సైన్స్ వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతు, మత్స్య సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. అఖిల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్స్‌లో మత్స్యశాఖ శిక్షణ కోర్సుల ద్వారా నైపుణ్యాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్పన, జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బయటకు వెళ్లి వస్తానని చెప్పిన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వైఎస్సార్ కాలనీ మొయిన్‌రోడ్డులోని సాయిగ్రూప్ హౌస్‌లో నివసించే ఈదిగ శిరీష, మన్నెం రాజశేఖర్ భార్యభర్తలు. వీరికి గతేడాది డిసెంబర్ 18న వివాహమైంది. మెడికల్ విభాగంలో పని చేసే రాజశేఖర్ శుక్రవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా నివారణలో పోలీసులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉంటూ ప్రజ్వల వంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాలని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. మానవ అక్రమ రవాణా శిబిరాలపై దాడులు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మానవ అక్రమ రవాణా వంటి నేరాలకు అడ్డుకట్ట వేయాలన్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ మోకా సత్తిబాబు శనివారం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా పోలీస్ అధికారులకు, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు మానవ అక్రమ రవాణాను నియంత్రించేందుకు తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ శ్రమ దోపిడి, అవయవాల మార్పిడి, లైంగిక దోపిడి చేసేందుకు కొంత మంది మానవ అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బలరామకృష్ణ, చంద్రయ్య, చెన్నయ్య, శ్రావణ్‌లు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రజలను ఎలా చైతన్యవంతులను చేయాలి అనే అంశంపై సంస్థ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో తయారు చేసిన వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దిశ ఏసీపీ వీవీ నాయుడు, కంట్రోల్ రూమ్ ఏసీపీ రాజశేఖర్ రాజు, దిశ ఇనస్పెక్టర్ వాసవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• గగన కాంతలు



ఏ మేఘవీణ మీటిందో ఉత్తుంగ తరంగమై గగనవేదికపై నర్తిస్తున్నాయి.. నగరంలోని రెడ్‌సర్కిల్‌లో శనివారం సాయంత్రం ఆకాశ వీధిలో సాక్షాత్కారించిన దృశ్యాన్ని, 'సాక్షి' క్లిక్‌మనిపించింది.
-కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్

రాష్ట్రాభివృద్ధికి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ దోహదం

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రాష్ట్రాభివృద్ధికి సంకేతమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎందరో దేశ, విదేశ పారిశ్రామిక దిగ్గజాలతో జరిగిన సదస్సులో పెట్టుబడులు వెల్లువై వచ్చాయని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిలో సాధిస్తున్న ప్రగతి, రాష్ట్రంలో అమలవుతున్న పారదర్శక పాలన, అభివృద్ధి దిశగా ఆయన వేస్తున్న అడుగులను పరిశీలించిన పారిశ్రామికవేత్తల ప్రశంసలు అభినందనీయమన్నారు. సీఎం జగన్ అంటే ఒక బ్రాండ్ అనే నమ్మకంతో ఆకర్షితులైన వారు పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. వీటితో రాష్ట్రంలో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల వస్తాయని తెలిపారు. ఇన్నాళ్లూ స్వయం ప్రకటిత మేధావి చంద్రబాబు గొప్ప విజనరీ నాయకుడని డబ్బా కొట్టిన పచ్చ మీడియా ఇంత భారీ పెట్టుబడులను ఎందుకు తీసుకురాలేక పోయారని ప్రశ్నించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ



కనకదుర్గ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులను సత్కరిస్తున్న జమలపూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. శనివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కనకదుర్గ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులైన చింతా సింహాచలం, కట్టా సత్తయ్యలను సత్కరించారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆలయానికి మంచి పేరు తేవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హిందూ ధర్మ పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిప్పరమల్లి ఆనందరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.3.55 లక్షలు



హుండీలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రూ.3,55,629 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ హేమలతాదేవి తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు హుండీల్లో కానుకల లెక్కింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో వివిధ ఉపాలయాల వద్ద భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈఓ సుబ్బారావు పరిశీలకునిగా హాజరైనట్లు పేర్కొన్నారు. లెక్కింపులో శ్రీ దుర్గాశివసాయి సేవా సంఘం సభ్యులు, కెనరా బ్యాంక్ అధికారులు, భక్తులు పాల్గొనట్లు తెలిపారు.